క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హసన్‌పర్తి: మరమ్మతుల కారణంగా చింతగట్టు టౌన్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. శనివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. గురుకుల జూనియర్ కళాశాల, గ్రీన్‌వుడ్, తేజస్వి, విజ్ఞాన్ పాఠశాలలు ఉన్న ప్రాంతాలతో పాటు దత్తాత్రేయ ఎస్టేట్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

కరెంట్ మీటర్లు ఇవ్వాలని వినతి



హన్మకొండ అర్బన్: ఇళ్లు లేని నిరుపేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారని, వారికి కరెంట్ మీటర్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు ప్రభుత్వం గుర్తించిన అన్ని రకాల గుర్తింపు కార్డులు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, అధికారులు కరెంట్ సౌకర్యం కల్పించపోవడంతో గుడిసెవాసులు అంధకారంలో జీవించాల్సి వస్తోందని తెలిపారు. అలాగే పేద, మధ్య తరగతి విద్యుత్ వినియోగదారుల నుంచి ప్రభుత్వం వసూళ్లు చేస్తున్న ఏసీడీ చార్జీలను వెంటనే రద్దు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.చుక్కయ్య, గుమ్మడి రాజుల రాములు, సంపత్ ఉన్నారు.

దేశీ మిర్చి @ రూ.71 వేలు

వరంగల్ రూరల్: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం దేశీమిర్చి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.71 వేలు పలికిందని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి బీవీ రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వండర్‌హాట్ మిర్చి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.36,500, కనిష్ట ధర రూ.30వేలు పలికిందన్నారు. అలాగే పత్తి క్వింటాల్‌కు రూ.7,690, కనిష్ట ధర రూ.6,500 పలికింది. లూజ్ పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,700, కనిష్ట ధర రూ. 7,400 పలికింది. మొత్తం 5,338 పత్తి బస్తాలు అమ్మకానికి వచ్చాయి.

విద్యార్థులు భాగస్వాములు కావాలి

వరంగల్: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విద్య విద్యాలయం న్యాక్ గుర్తింపు సాధించే ప్రక్రియలో విద్యార్థులు భాగస్వాములు కావాలని దేశాయిపేటలోని సీకేఎం కళాశాల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.ధర్మారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్‌రావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు న్యాక్ నుంచి వచ్చే ఈ–మెయిల్‌కు తక్షణమే స్పందించాలని పేర్కొన్నారు.

విద్యారణ్యపురి: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ న్యాక్ గుర్తింపులో విద్యార్థులు భాగస్వాములు కావాలని యూనివర్సిటీ హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేడ్కర్ అభ్యాసక సహాయ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ సంజీవయ్య ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులకు న్యాక్ నుంచి ఈ–మెయిల్ వస్తుందని, దానికి విద్యార్థులు స్పందించాలని సూచించారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

కాజీపేట రూరల్: ఎలక్ట్రీషియన్ డేను కాజీపేట బాపూజీనగర్ సెంటర్ వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అడ్వైజర్ మైసారపు సిరిల్‌లారెన్స్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు కలిసి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘం నూతన క్యాలెండర్‌ను చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రెసిడెంట్ పి.జాక్సన్, వైస్ ప్రెసిడెంట్ టి.మల్లేష్, సెక్రటరీ సిహెచ్.భాస్కర్, ట్రెజరర్ జె.కుమార్ పాల్గొన్నారు.

'రేపు ప్రజ్ఞాభారతి' సదస్సు

విద్యారణ్యపురి: హనుమకొండ బాలసముద్రంలోని సామజగన్ మెమోరియల్ భవనంలో ఈనెల 29న ఉదయం ప్రజ్ఞాభారతి వరంగల్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు ప్రజ్ఞా భారతి కన్వీనర్ ప్రొఫెసర్ ఎల్.రాంగోపాల్‌రెడ్డి, కోకన్వీనర్ టి.బుచ్చిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాల్లో భాగంగా 'నిజాం దురాగతాలు – హైదరాబాద్ రాష్ట్ర స్వాతంత్ర్య వీరోచిత పోరాట విశేషాలు – విస్మరించలేని చారిత్రక వాస్తవాలు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన వక్తగా హైదరాబాద్‌లోని ప్రముఖ జర్నలిస్టు రాకా సుధాకర్‌రావు ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

మామునూరు: వరంగల్ జక్కలొద్ది గ్రామ శివారులోని ప్రభుత్వ సీలింగ్ భూముల్లో నుంచి అక్రమంగా జేసీబీలతో మట్టిని తోడి రోడ్డు నిర్మాణానికి వినియోగిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఫిర్యాదు చేసినా రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టింపు లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

కాజీపేట: ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సమ ప్రాధాన్యతనిస్తూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ముందుకు సాగుతున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట చౌరస్తాలో ప్రజలతో శుక్రవారం ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. 72మందికి కల్యాణలక్ష్మి, 45మందికి షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయడంతో పాటు 63వ డివిజన్ వెస్లీ పాఠశాల సమీపంలో రూ.16 లక్షల కుడా నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, కార్పొరేటర్లు విజయశ్రీ రజాలీ, ఎలకంటి రాములు, ఆర్‌ఐ దశరథ రామిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



ముఖాముఖిలో మాట్లాడుతున్న చీఫ్ విప్

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

హన్మకొండ: బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేకంగా విద్యార్థి, యువత, మహిళలు ఉద్యమించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సీఐటీయూ, ఐద్వా, డీవైఎఫ్‌ఐ, కేవీపీఎస్, తెలంగాణ వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు హనుమకొండ సమ్మయ్యనగర్‌లో గురువారం రాత్రి బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు విజేతలకు చీఫ్‌విప్ బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. బీజేపీ విధానాలు, దాని మతోన్మాద చర్యలతో దేశంలోని ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని వివరించారు. సీఐటీయూ నాయకుడు టి.ఉప్పలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం హనుమకొండ జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.చుక్కయ్య, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వాంకుడోత్ వీరన్న, 100 ఫీట్ల రోడ్డు కాలనీల జేఏసీ కన్వీనర్ డాక్టర్ నల్లారి శ్రీనివాస్, ఐద్వా జిల్లా కార్యదర్శి దీప, మత్స్యకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గొడుగు వెంకట్, 53వ డివిజన్ కార్పొరేటర్ సోదా కిరణ్, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్నే అమలు చేయాలి

హన్మకొండ అర్బన్: ఉద్యోగులకు ఈ – కుబేర్, ఎన్‌పీఎస్ కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ –1980 విధానాన్నే అమలు చేయాలని టీఎస్ఎస్ఓఎస్ జిల్లా అధ్యక్షుడు పసునూరి ప్రసాద్ కోరారు. తెలంగాణ స్టేట్ అండ్ సబార్డినేట్ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఓఎస్) జిల్లా శాఖ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా ట్రెజరీ డీడీ గుజ్జురాజు తన చాంబర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ ఎన్‌పీఎస్ కొత్త పెన్షన్ విధానంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. వెంటనే ఎన్‌పీఎస్ పెన్షన్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ డీడీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఓఎస్ ఉపాధ్యక్షుడు సుద్దాల సుకుమార్, జనరల్ సెక్రటరీ బొడ్డు ప్రసాద్, జాయింట్ సెక్రటరీ నేరెళ్ల ప్రవీణ్‌కుమార్, కోటి సులోచన, ట్రెజరర్ షేక్ అఫ్జల్, హరికుమార్, దివ్య, కార్యవర్గ సభ్యులు వేణు, రజనీకాంత్, ముత్తయ్య, వంశీ, భానుచందర్, రమ్య, ఫాహిం, సుమన్, అనిత, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రాజు, తదితరులు

రోస్టర్ కమ్ సీనియార్టీ అమలు చేయాలి



శ్రీహరికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల పదోన్నతుల్లో రోస్టర్ కమ్ సీనియారిటీని అమలు చేయాలని తెలంగాణ స్టేట్ ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్యాం మనోహర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రయ్య కోరారు. ఈమేరకు కనకదుర్గ కాలనీలోని స్వగృహంలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని అసోసియేషన్ నాయకులు శుక్రవారం కలిశారు. కార్యక్రమంలో స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు ఆనందం, సెక్రటరీ కుమారస్వామి, నాయకులు గంగరాజు, మొగులయ్య, ఆగయ్య, నర్సింగరావు, రవిష్, సందీప్‌కుమార్, మధుకర్ పాల్గొన్నారు.

విద్యార్థుల అల్పాహారానికి నిధుల అందజేత



నగదు అందజేస్తున్న నిర్వాహకులు

విద్యారణ్యపురి / హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 10వ తరగతి విద్యార్థులకు అరూరి గట్టుమల్లు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్పాహారం అందించేందుకు నిధులు విడుదల చేసినట్లు మన బడి – మన బాధ్యత కన్వీనర్ దోమకుమార్ తెలిపారు. ఈమేరకు హనుమకొండలో డీఈఓ అబ్దుల్‌హై, వరంగల్ డీఈఓ వాసంతి చేతుల మీదుగా సంబంధిత మండలాల ఎంఈఓలకు శుక్రవారం నిధులను అందజేశారు. హనుమకొండ జిల్లాలో కడిపికొండ, కాజీపేట, తరాలపెల్లిలోని 128మంది విద్యార్థులకు నెలరోజుల పాటు స్నాక్స్ అందించేందుకు రూ.38,400 అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఎంఈఓ రామకృష్ణరాజు, వెంకటేశ్వర్లు, రంగయ్య, సత్యనారాయణ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వరంగల్ చౌరస్తా: పేద, మధ్య తరగతి వర్గాల ఆర్యవైశ్యులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. ఆర్యవైశ్య మిత్ర బృందం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మేదరివాడలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని, వ్యాపారస్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మిత్ర బృందం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు, కోశాధికారి దుర్గా మోహన్‌రావు, ఆర్యవైశ్య నాయకులు స్థానిక కార్పొరేటర్ గందె కల్పన పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాలు

హసన్‌పర్తి: నగరంలోని 56వ డివిజన గోపాలపురంలో కంటి వెలుగు శిబిరం కొనసాగుతోంది. ఈక్రమంలో శిబిరంలో జబర్దస్త్ సీరియల్ ఫేం వెంకీ శుక్రవారం కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ తేజస్విని, క్యాంప్ సూపర్‌వైజర్ ఇమ్మడి బాబు, ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చింతల్‌లో..

న్యూశాయంపేట: కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా నగరంలోని చింతల్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి మోహన్‌రావు ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, మెప్మా సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



న్యూశాయంపేట: కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆలయంలో మహా సుదర్శన హోమం



మహా సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

కాశిబుగ్గ: కాశిబుగ్గలోని రంగనాథస్వామి ఆలయంలో వేంకటేశ్వర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం రెండవ రోజు ఆలయంలో మహా సుదర్శన హోమం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, చిలుపూరి సురేష్, సుల్తాన, సమ్మక్క, సాంబారి సాయన్న, రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు. కాగా, వేంకటేశ్వర మహోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వంగరి రవి తెలిపారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

వరంగల్ చౌరస్తా: వరంగల్ రామన్నపేట బట్టలబజారులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం హంస వాహనంపై భక్తులకు స్వామి దర్శనమిచ్చారు. అనంతరం సుదర్శన నరసింహ ఇష్టి, ఆశీర్వచనం, అశ్వవాహన సేవ, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గందె కల్పన, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గందె గోవిందరాజులు, గుమ్మడివెల్లి సత్యనారాయణ, ఆలయ సేవా సమితి సభ్యులు, రవ్వ కృష్ణమూర్తి, రేపాల సురేష్, తొలుపునూరి అశోక్, ఆలయ కార్యనిర్వాహణాధికారి రత్నాకర్ రెడ్డి పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న భక్తులు

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం



కేయూ రెండోగేట్ వద్ద ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

హన్మకొండ / కేయూ క్యాంపస్ /హసన్‌పర్తి /ఖిలా వరంగల్ : గవర్నర్ తమిళిసైపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు నగరంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. గవర్నర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆక్షేపణీయమని, ఈక్రమంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ వరంగల్ జిల్లా కోశాధికారి డాక్టర్ వన్నాల వెంకటరమణ డిమాండ్ చేశారు. హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలోని స్వగృహంలో ఆయన మాట్లాడారు. బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కేయూ రెండో గేట్‌వద్ద శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ మాట్లాడారు. ఈమేరకు కరీంనగర్ – హనుమకొండ ప్రధాన రహదారిలోని హసన్‌పర్తిలో బీజేపీ నాయకులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా నాయకుడు కుసుమ సతీష్ డిమాండ్ చేశారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఇసుక అడ్డా జంక్షన్‌లో మహిళా మోర్చా సింగారపు సుజాత, కార్యవర్గ సభ్యురాలు మంజులరెడ్డి, రాష్ట్ర ఎస్సీ లీగల్ సెల్ కన్వీనర్ డాక్టర్ గోపికరెడ్డి ఆధ్వర్యంలో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టాలి



వీసీలో పాల్గొన్న రాజీవ్‌గాంధీ హన్మంతు



కరీమాబాద్: వీసీలో పాల్గొన్న కలెక్టర్ గోపి

హన్మకొండ అర్బన్ / కరీమాబాద్ : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలని, ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని అధికారులను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంగా హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు వేర్వేరుగా పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ జిల్లాలో మన ఊరు – మన బడిలో భాగంగా 14 మండలాల్లో 28 పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. 22 మోడల్ స్కూళ్లలో 14 పాఠశాలల్లో పనులు పూర్తి అయ్యాయని, ఇంకా 8పాఠశాలల్లో పనులు పూర్తి కావాల్సి ఉందని వివరించారు. ఫిబ్రవరి 10 నాటికి పనులన్నీ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే, జిల్లాలో చేపట్టే టీచర్ల బదిలీలు, పదోన్నతులకు సీనియార్టీ జాబితా సమర్పించామని, ఖాళీ జాబితా కూడా సమర్పించనున్నట్లు తెలిపారు. అలాగే, వీసీలోబ వరంగల్ కలెక్టర్ గోపి పాల్గొని మాట్లాడుతూ మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా 223 పాఠశాలల్లో 24 పాఠశాలలకు పెయింటింగ్ పూర్తయిందని, మిగతావి వారం రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.

బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు పెంచాలి

హన్మకొండ: పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు.జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యాంయాదవ్ మాట్లాడుతూ బీసీలను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే వాడుకుంటూ వారి సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మేరుగు శివానంద్, ముత్యాల యుగేందర్, సుధాకర్, స్వామియాదవ్, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సంఘం నాయకులు, విద్యార్థులు

జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

నయీంనగర్: రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని హనుమకొండ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి చీఫ్‌విప్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్ కోమల, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, సదయ్య, డీపీఆర్ఓ లక్ష్మణ్‌కుమార్, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్‌మోహన్, కోశాధికారి బోల్ల అమర్, సీనియర్ జర్నలిస్టులు, కార్యవర్గ సభ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ఆదరించాలి

హన్మకొండ: అనాథ పిల్లలను ప్రతిఒక్కరూ ఆదరించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ వి.తిరుపతిరెడ్డి సూచించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ బాలసముద్రంలోని అనాథ ఆశ్రమం ఆనంద నిలయంలో వసతి పొందుతున్న బాలికలకు తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుస్తులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూసేవా కార్యక్రమాలు చేపడుతున్న తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ డిస్కం ఉపాధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్, హనుమకొండ జిల్లా కార్యదర్శి కృష్ణ, గుర్రం శ్యామ్‌కుమార్, సారయ్య, రాంబాబు, గణేష్, విజయ్, ఆశ్రమ వార్డెన్ ఇనుగాల సుజాత, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న తిరుపతిరెడ్డి, నాయకులు

సంక్షిప్తంగా

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

హన్మకొండ అర్బన్: ఈపీఎఫ్ కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈపీఎఫ్ వరంగల్ నోడల్ అధికారి బి.నాగులు సూచించారు. ఈపీఎఫ్ వరంగల్ రీజినల్ కమిషనర్ ప్రణీత్ జోషి ఆధ్వర్యంలో నగరంలోని ఎస్ఆర్ నేషనల్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన నిధి ఆప్కే నికట్ అవగాహన కార్యక్రమంలో నాగులు మాట్లాడారు. ప్రభుత్వ పథకాలపై కార్మికులు అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఎఫ్ అధికారులు ప్రశాంత్, జి.కిషోర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, ట్రేడ్ యూనియన్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం

వరంగల్ చౌరస్తా: హర్యానాలో వచ్చేనెల 17న జరగనున్న జాతీయ ఓపెన్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైన దామెర మేరికి శాఫ్ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజనాల శ్రీహరి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. రాష్ట్ర స్థాయిలో పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన ధర్మసాగర్‌కు చెందిన మేరికి వరంగల్ చౌరస్తాలో రూ.10వేల ఆర్థికసాయం అందించి అభినందించారు.

వ్యాపార రంగంలో మార్పులపై సదస్సు

నయీంనగర్: భారత వ్యాపార రంగంలో వస్తున్న మార్పులపై హనుమకొండ కిషన్‌పుర చైతన్య (డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయం)లో కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో భారత వ్యాపార రంగంలోని నూతన వైఖరులు – విజయానికి వ్యూహాలు అనే అంశంపై రెండు రోజులు జాతీయ సదస్సు.. కళాశాల ఉపకులపతి జి.దామోదర్ అధ్యక్షతన శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా యాప్ టీవీ ఫౌండర్, సీఈఓ ఉదయ్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాపార రంగంలో వస్తున్న ఆధునిక మార్పులపై, వాటి నిర్వహణ, స్టార్టప్ కంపెనీల ఏర్పాటుకు ఎదురయ్యే సమస్యలు, వాటి అభివృద్ధి, భవిష్యత్తు గురించి వివరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ ఫ్యాకల్టీ ప్రొఫెసర్‌కె.వి.అచలపతి మాట్లాడుతూ వ్యాపార రంగంలో వస్తున్న నూతన పోకడలను వివరించారు. సదస్సులో ప్రొఫెసర్లు రవీందర్, పి.కృష్ణమాచారి, సిహెచ్.రాజేశం, పి.రాజేందర్, అధ్యాపకులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

కాజీపేట: పిల్లలు తరగతి గదులకే పరిమితం కాకుండా చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తాళ్ల పద్మావతి విద్యా సంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం సూచించారు. కాజీపేట మండలం సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఒలింపియాడ్ పాఠశాల ఆవరణలో శుక్రవారం సాయంత్రం స్పోర్ట్స్‌డే వేడుకల ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 16 రకాల క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్యలతో పాటు సతీష్ పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

హసన్‌పర్తి: గ్రామంలో ఇరువర్గాల మధ్య జరుగుతున్న వివాదాన్ని సద్దుమణిగించడానికి వెళ్లిన సర్పంచ్ గాయాలపాలయ్యారు. ఈ సంఘటన సీతంపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. సీతంపేటలో ఓ విషయంతో ఇరు వర్గాలు గొడవకు దిగగా, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈక్రమంలో స్థానిక సర్పంచ్ జనగాని శరత్‌కుమార్.. వారిని వారించడానికి వెళ్లారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో ఓ వర్గానికి చెందిన వ్యక్తి సర్పంచ్ కాలును కొరికాడు. దీంతో గాయాలపాలైన సర్పంచ్‌ను నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది.

మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా రఫీక్



ఎంజీఎం: తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా మహ్మద్ రఫీక్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఈమేరకు రాష్ట్ర కార్యదర్శిగా రఫీక్‌ను ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు మహ్మద్ యూసుఫ్ ప్రకటించారు.

నిట్ అల్యూమ్ని క్యాలెండర్ ఆవిష్కరణ

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో నిట్ వరంగల్ అల్యూమ్ని న్యూ ఇయర్ క్యాలెండర్‌ను నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు, డీన్ పులి రవికుమార్, రామశేషు, శ్రీనివాస్, వేణు, వినోద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓపెన్ టాక్ కార్యక్రమాన్ని అల్యూమ్ని ప్రారంభించింది. ప్రతినెల అల్యూమ్ని నిట్ విద్యార్థులతో ఇంటరాక్టివ్ సిరీస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు నిట్ డైరెక్టర్ రమణారావు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన ఓపెన్ టాక్‌లో రిటైర్డ్ డీజీపీ కృష్ణప్రసాద్ పాల్గొని సిరీస్‌ను ప్రారంభించారు.

డీసీసీబీ చైర్మన్ మార్నేనికి పరామర్శ

హన్మకొండ: వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. కాలి మడమ గాయంతో బాధపడుతున్న రవీందర్‌రావును ఐనవోలులోని స్వగృహంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, సమ్మయ్య, ఒడిచర్ల శ్రీనివాస్, అన్వర్ శుక్రవారం పరామర్శించారు.

పోస్టల్ డిపాజిట్ పథకాలకు పెరిగిన వడ్డీ రేట్లు

కాజీపేట: తపాలా శాఖలోని అన్ని పోస్టల్ డిపాజిట్ పథకాలకు వడ్డీ రేట్లు భారీగా పెరిగాయని హనుమకొండ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పి.ప్రభాకర్ తెలిపారు. కాజీపేట పోస్టాఫీసులో శుక్రవారం ఏర్పాటు చేసిన ఖాతాదారుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకుని, పొదుపు పథకాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజలు అడిగిన పలు ప్రశ్నలకు ముఖాముఖి సమాధానాలు తెలిపారు. సమావేశంలో పోస్టుమాస్టర్ ఉషశ్రీ, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్